ఇంకుడు గుంతలతో వరదనీటికి చెక్

భారీ ఇంకుడు గుంతలతో పాటు సంప్‌ల ఏర్పాటు

ఖైరతాబాద్ సర్కిల్‌లో నాలుగు చోట్ల నిర్మాణాలు

ఖైరతాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో ఒక మోస్తరు వర్షం పడితే చాలు రోడ్లపై నీరు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నగర నడిబొడ్డున ఉన్న ఖైరతాబాద్ సర్కిల్‌లో గవర్నర్ కొలువుండే రాజ్‌భవన్ మార్గంలోని లేక్ వ్యూ గెస్ట్ హౌజ్, విల్లామేరీ కళాశాలతో పాటు ప్రగతి భవన్ వద్ద భారీగా వదర నీరు నిలుస్తోంది. దీంతో ఆ దారిలో ప్రయాణించే వాహనదారులు నానా అస్థలు పడుతున్నారు. ఈ సమస్యలపై అధ్యయనం చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు నీరు నిలిచే ప్రాంతంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వెంటనే ఈ నాలుగు చోట్ల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. వర్షాకాలంలోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు.

నీరు భూమిలోకి ఇంకేలా ఇంజక్షన్ బోర్లు

వర్షం వస్తే నీరు నిలిచే ప్రాంతాలైన సచివాలయ ఎదురుగా ఉన్న బస్టాపు, రాజ్‌భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్ హౌజ్, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్, కేసీపీ చౌరస్తా దగ్గర్లోని మెర్క్యురీ హోటల్ వద్ద ఈ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు రూ.4 కోట్ల నిధులతో చేపడుతున్న ఈ పనులు ఇప్పటికే సగానికి పైగా పూర్తయ్యాయి. ఇందులో భాగంగా మొదట భూమిలోకి వర్షపు నీరు ఇంకేలా ఇంజక్షన్ బోర్లను వేస్తారు. దాదాపు 100 నుంచి 150 అడుగుల లోతులో ఈ బోర్లను వేసి వర్షపునీరు నిలిచే ప్రాంతాల నుంచి పైప్‌లైన్ల ద్వారా అక్కడికి వెళ్లి భూమిలోకి ఇంకేలా ఏర్పాట్లు చేస్తారు. దీంతో పాటు అక్కడ భారీ గొయ్యిని తవ్వి ఇంకుడు గుంతను నిర్మిస్తారు. అందులో ఇసుక, కంకర వేసి


సచివాలయం ఎదురుగా ఉన్న బస్టాప్ వద్ద నిర్మిస్తున్న నీటి నిలువ కేంద్రం

భూమిలోకి ఇంకిన అనంతరం మిగిలిన నీరు నిల్వ ఉండేలా సంపులు ఏర్పాటు చేస్తున్నారు. సంపుల్లోకి చేరిన నీటిని ఇతర అవసరాల కోసం వినియోగించడంతో పాటు వరుసగా వర్షాలు వస్తే నీటిని అక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలుపుతున్నారు.

ముంపు సమస్యకు చెక్ పడేనా?

లేక్ వ్యూ గెస్ట్ హౌజ్ వద్ద 12 లక్షల లీటర్ల నీరు నిలువ ఉండే సామర్థ్యంతో ఇంకుడు గుంత, సంప్ నిర్మిస్తున్నారు. సచివాలయ ఎదురుగా ఉన్న బస్టాపు వద్ద 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద 4 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంప్‌లను నిర్మిస్తున్నారు. కేసీపీ చౌరస్తాలో 3 లక్షల లీటర్ల నీరు నిలిచే సామర్థ్యంతో సంప్‌ను నిర్మించి మిగతా నీటిని అక్కడి నుంచి ఆర్‌టీఏ కార్యాలయంలోకి రప్పించి అక్కడ


లేక్‌వ్యూ గెస్ట్ హౌజ్ వద్ద జరుగుతున్న పనులు

మరో 10 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో సంప్‌ను నిర్మిస్తున్నారు. సచివాలయం బస్టాపుతో పాటు ఖైరతాబాద్ మెట్రో వద్ద జరుగుతున్న పనులను సీఆర్‌ఎంపీకి అప్పగించగా లేక్ వ్యూ గెస్ట్ హౌజ్‌తో పాటు కేసీపీ చౌరస్తా పనులను జీహెచ్‌ఎంసీ చేపడుతోంది. కాగా సచివాలయ బస్టాపు వద్ద ఇంజక్షన్ బోర్లు వేస్తుండగా సాగర్ పరీవాహక ప్రాంతం కావడంతో 60 నుంచి 70 అడుగుల్లోనే నీరు ఉబికివచ్చాయి. ఇలాంటి చోట నీరు భూమిలోకి ఎక్కువ మొత్తంగా ఇంకే అవకాశాలు లేకపోవడంతో పైప్‌లైన్ ద్వారా అక్కడి నుంచి తరలించే ఏర్పాట్లను చేస్తున్నారు. కేసీపీ చౌరస్తా వద్ద సంపు నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో ఆర్‌టీఏ కార్యాలయంలో భారీ సంప్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నా, ఆర్‌టీఏ అధికారుల అనుమతి దొరికే విషయంలో సందేహాలున్నాయి. మొత్తం మీద జీహెచ్‌ఎంసీ అలస్యంగా ప్రారంభించిన ఈ పనులు రోడ్లపై నీరు నిలువ ఉండకుండా ఎంతవరకు పనిచేస్తాయో వేచి చూడాల్సిందే.


వరలక్ష్మీ వ్రతమాచరిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

బంజారాహిల్స్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ముఖ దర్శనం అమలు చేశారు. ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ దంపతులు శుక్రవారం వారి స్వగృహంలో వ్రతాన్ని ఆచరించారు.

ఏపీ అమెరికన్ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్‌గా గిరీశ్



బంజారాహిల్స్ ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్(ఏఏఏ) నేషనల్ ప్రెసిడెంట్‌గా ఇయ్యపు గిరీశ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఏపీవాసుల కోసం మొట్ట మొదటి ఏకైక జాతీయ సంస్థ ఏపీ అమెరికన్ అసోసియేషన్ అని వారు తెలిపారు. దీన్ని మోతుపల్లి శ్రీహరి స్థాపించినట్లు తెలిపారు. అమెరికాలోని పది రాష్ట్రాల్లో దీని కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో గిరీశ్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అమెరికాలోని ఆంధ్రులందరినీ ఒక్కతాటిపైకి తేవడంతో పాటు, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ పదవిలో తాను రెండేళ్ల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. పలు ఎన్జీవోలతో కలిసి తాము ఇప్పటి వరకు ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

సాంకేతిక శిక్షణ కోసం టాస్క్‌తో 'మాట' ఒప్పందం


ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న 'మాట' సభ్యులు

బంజారాహిల్స్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ప్రాంప్ట్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, యాప్ డెవలపింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్లలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాట(మన అమెరికన్ తెలుగు అసోసియేషన్) ఫౌండర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గనగోని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎంఓయూను టాస్క్‌తో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఐటీ సెక్రటరీ జయేశ్‌రంజన్‌తో మార్చుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామీణ, అర్బన్, సబర్బన్ ప్రాంతాల్లో ఉండే యువత స్కిల్స్‌ను పెంచేందుకు, టెక్నాలజీ రంగంలో ఉండే వివిధ కోర్సులను వారికి నేర్పించడంతో పాటు వారి సామర్థ్యాన్ని పెంచేందుకు 'మాట' సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. టాస్క్‌తో సమన్వయం చేసుకుంటూ తాము పని చేస్తామని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2 నుంచి కామారెడ్డి జిల్లా నుంచి తాము ఈ శిక్షణను ప్రారంభిస్తున్నామని తొలి దశలో వెయ్యి మంది విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఫౌండర్ ప్రదీప్ సామల, నాగేష్ చిక్కులపాటి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించాలి


ట్రాఫిక్ ఎస్‌ఐతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్,ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌లో రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ అధికారులను కోరారు. కొంతమంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి డబ్బాలు, తోపుడు బండ్లు పెట్టించి రోజు, నెల వారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్‌ఐ నాగరాజు, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆమె యాదగిరినగర్‌లో పర్యటించారు. ఆక్రమణలను స్వయంగా పరిశీలించారు. రహదారిపై అడ్డదిడ్డంగా నిలిపి ఉంచిన వాహనాలు, చిరు వ్యాపారులను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. రహదారిపై తోపుడు బండ్లు, డబ్బాలు పెట్టించి వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని, సభ్యులకు ఇబ్బంది లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నిస్తానని కేవీఎస్‌వై వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేశ్ గౌడ్ పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కేవీఎస్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణాగౌడ్, ముఖేష్, సత్యనారాయణ, గోపాలకృష్ణాగౌడ్, ఆవు నరసింహ, శివగౌడ్, మనోజ్, బోడ్డుప్రసాద్ గౌడ్, శ్రీకాంత్ గుప్తా, మధుసూదన్ గౌడ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌లపై దాడి.. 136 మద్యం బాటిళ్ల పట్టివేత

బోరబండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 136 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. బంజారా నగర్‌లో కొంత కాలంగా ఓ మహిళ బెల్ట్ షాపు నిర్వహిస్తుంది. పలుమార్లు దాడులు నిర్వహించి ఆమెపై ఇప్పటికే 9 కేసులు నమోదు అయ్యాయన్నారు. పోలీసుల రాకను గమనించిన ఆ మహిళ పరారీలో ఉన్నారని ఆమె కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు. కాగా, బోరబండలో ఓ ఎస్సై అరాచకమంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తను ఏసీపీ వెంకటరమణ ఖండించారు. పోలీసులు ప్రజల రక్షణకే ఉన్నారని తెలిపారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు ఎవరు చేసినా పోలీసులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారన్నారు.

పనులు పూర్తికాగానే రోడ్లను పునరుద్ధరించాలి

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీ

రహదారుల్లో ప్యాచ్ వర్క్ చేయకపోవడంపై అగ్రహం


రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): ఏ పనులు మరమ్మతు పనులు చేపట్టినా.. అవి పూర్తికాగానే రోడ్డు పునరుద్ధరణ పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ స్పష్టం ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీ పాలపిట్ట సర్కిల్ పరిసర ప్రాంతాల్లో తిరిగి రహదారులపై ఉన్న ప్యాచ్ వర్క్స్ చేయకుండా వదిలేసిన గుంతలను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలోని వాటర్ లాగింగ్ పాయింట్‌ను గుర్తించి సంపు నిర్మించడానికి అనువైన ప్రాంతాన్ని చూడాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున.. గార్బేజీ వనరబుల్ పాయింట్లపై (తరచూ చెత్త వేసే ప్రాంతాలు) ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45, రోడ్ నం.70, గౌతంనగర్ బస్తీ, దీన్ దయాళ్ నగర్ బస్తీ, ఫిల్మ్‌నగర్, పీఈటీ పార్క్ ప్రాంతాల్లో తరచూ చెత్త వేసే ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యల్ని తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల హాజరు తదితర వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలుంటే.. ఉన్నతాధికారులకు తెలియజేయాలని కార్మికులకు చెప్పారు. పని వేళల్లో కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం, హ్యాండ్ గ్లౌజ్ ధరించి.. రక్షణ చర్యలు పాటించాలన్నారు. అలాగే నగరంలో చెత్త ఎక్కువగా ఉత్పన్నమయ్యే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాంటి ప్రాంతాల్లో రెండు షిఫ్టుల్లో చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం.. పలు వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న నీటి నిల్వ సంపుల పనుల్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఈఈ విజయ్ కుమార్, వాటర్‌బోర్డు జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుర్వేద కళాశాల విద్యార్థులు

ఎర్రగడ్డ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగి దుశ్చర్యకు కారకులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని ఆయుర్వేద కళాశాల వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాలలో వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అత్యాచారాలపై ప్రభుత్వం కఠినమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్యను వ్యతిరేకిస్తూ శుక్రవారం పీజీ విద్యార్థులు తమ సేవలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల పీజీ, యూజీ విద్యార్థులతో ఇంటర్‌ని వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో మూడు పారిశ్రామిక ప్రదర్శనలు



బ్రోచర్లను చూపుతున్న పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణ, బ్యాటరీల రీసైక్లింగ్, మెషీన్ టూల్స్‌లో సరికొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తూ మాదాపూర్ హైటెక్స్‌లో ఏకకాలంలో మూడు రకాల పారిశ్రామిక ప్రదర్శనలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రదర్శనలో ఆయా రంగాలకు చెందిన 450 సంస్థలు తమ స్టాళ్లను ప్రదర్శనలో ఉంచినట్లు హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తెలిపారు. బ్యాటరీ రీ సైక్లింగ్ దేశంలోనే రెండో పెద్ద మార్కెట్‌గా మారుతోందని, బ్యాటరీల పునర్వినియోగం, రీ సైక్లింగ్‌పై ఏకరూప నిబంధనలు లేవని వక్తలు తెలిపారు. చైనా, యూరప్, జపాన్‌లలో ఇలాంటి నియంత్రణలు ఉన్నారని తెలిపారు. సదస్సులో మాట్లాబ్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ వర్గీస్ శామ్యూల్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ అసోసియేషన్ డాక్టర్ శైలేంద్ర సరోజ్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ రోబోటిక్ ఆటోమేషన్ ప్రెసిడెంట్, రాజ్ కుమార్ శర్మ, చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఫేజ్ 3 అధ్యక్షుడు రమేష్ మియ్యపురం, నేషనల్ సాలిడ్ వేస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ అమియా కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ కాలనీలో చెట్ల కొమ్మల తొలగింపు

బేగంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలు రోడ్డుపైకి విస్తరించడంతో బేగంపేట డివిజన్‌లోని మోతిలాల్ నెహ్రూ నగర్ కాలనీ వాసులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు విన్నవించారు. దీంతో ఆమె విషయాన్ని ఆమ జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ హార్టీకల్చర్ విభాగానికి చెందిని సిబ్బంది పెద్ద క్రేన్ ద్వారా రోడ్లపైకి వ్యాపించి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. కాలనీలోని అన్ని రోడ్లలో అడ్డంగా ఉన్న కొమ్మలను అధికారులు తొలగించారు. కార్యక్రమంలో అధికారులతో పాటు కాంగ్రెస్ నేత , కాలనీ అసోసియేషన్ ప్రతినిధి విశాల్ సుదం తదితరులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

సిటీ సీపీ 'కొత్తకోట'కు శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): డీజీపీగా పదోన్నతి పొందిన హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, సిటీ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నల్లా శంకర్‌రెడ్డి, కో ఆపరేటివ్ ట్రెజరర్ విక్టర్, వైస్ ప్రెసిడెంట్ ఆసిఫ్‌ఖాన్, సభ్యుడు జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

సర్వైకల్ కేన్సర్‌పై అవగాహన వాక్


వాక్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ పూర్ణచందర్‌రావు

ఖైరతాబాద్,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సర్వైకల్ కేన్సర్ పట్ల మహిళలందరూ జాగ్రత్తగా ఉండాలని సచివాలయ ఏసీపీ పూర్ణచందర్ సూచించారు. శుక్రవారం మాంటీ ప్రొడక్షన్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నేడు జరగనున్న జాతీయ స్థాయి అందాల పోటీల్లో భాగంగా పోటీలో పాల్గొంటున్న వారిని ఆహ్వానిస్తూ నిర్వాహక సంస్థ మహిళల సర్వైకల్ కేన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ వాక్ నిర్వహించారు. సచివాలయ ఏసీపీ పూర్ణచందర్ ప్రారంభించిన ఈ వాక్‌లో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. నెక్లెస్‌రోడ్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభమైన ఈ వాక్ ఐమాక్స్ మల్టీప్లెక్స్ వరకు సాగింది. ఐమాక్స్‌లో యువతీ యువకులు నృత్యాలు చేస్తూ సర్వైకల్ కేన్సర్ పట్ల జాగ్రత్త అవసరమని అవగాహన కల్పించారు. ఇందులో స్క్వాష్ ఇండియా జనరల్ మేనేజర్ శివారెడ్డి, నిర్వాహకుడు అతుల్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

చేనేత వస్త్రాలను ధరించి కళాకారులకు చేయూతనివ్వాలి : మంత్రి పొన్నం

ఖైరతాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పీవీ నర్సింహారావు మార్గంలోని పీపుల్స్‌ప్లాజాలో జరుగుతున్న చేనేత వస్త్ర ప్రదర్శనను శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఆయనతో పాటు శాసనసభ్యుడు సత్యనారాయణతో కలసి ప్రదర్శనలోని స్టాళ్లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలను ధరించి చేనేత కళాకారులకు చేయూతనందించాలని పిలుపునిచ్చారు. కాగా, ఈ ప్రదర్శనను మరో రెండు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన శుక్రవారంతో ముగియనుండగా ఆదివారం వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

ఖైరతాబాద్ 2బీహెచ్‌కే అసోసియేషన్ అధ్యక్షుడిగా అనిల్



ఖైరతాబాద్,ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలోనే ప్రతిష్టాత్మకంగా గుర్తింపు పొందిన ఖైరతాబాద్ ఇందిరానగర్ డబుల్ బెడ్‌రూం డిగ్నిటీ హౌజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోమారు డిబి అనిల్ ఎంపికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఆయనను లబ్ధిదారులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష పోటీల్లో టీ. నర్సింగ్‌రావు బరిలోకి దిగినా, చివరి నిమిషంలో ఆయన అనిల్‌కు మద్దతుగా నిలిచి పోటీ నుంచి విరమించుకోవడంతో అనిల్ రెండోసారి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి లక్ష్మణ్ యాదవ్ ప్రకటించారు. తనపై నమ్మకంతో రెండోసారి ఎన్నుకున్న లబ్ధిదారులందరికీ అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తూ 2బీహెచ్‌కేలో ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేయడంతో పాటు మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా ఈ అసోసియేషన్ నైపుణ్యాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం గత రిపబ్లిక్ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అవకాశం కల్పించింది.

అక్రమ పార్కింగ్‌లను తొలగించాలి

వెంగళరావునగర్,ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో రోడ్డు ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లను తొలగించాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రతాప్ రెడ్డి, కోడె సాంబశివరావ జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ విభాగాల అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సంక్షేమ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణలు, వాహనాల పార్కింగ్ తమకు తలనొప్పిగా మారిందన్నారు. పలు మార్లు ఆయా వాహనాల యజమానులకు చెప్పినా ఫలితం లేకుండా పోతుందని అన్నారు.కాలనితో సంబంధం లేని వారు రాత్రి వేళల్లో తమ వాహనాలనురోడ్డుకు ఇరువైపులా నిలిపి వెళ్లిపోతున్నారని తెలిపారు. దీంతో తరచూ ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మౌంట్ ఎల్బ్రస్‌పై ఎగిరిన మువ్వన్నెల జెండా

యూరప్‌లో అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించిన దుండిగల్ యువకుడు


ఎల్బ్రస్ పర్వతంపై జాతీయజెండాను ప్రదర్శిస్తున్న తులసిరెడ్డి

దుండిగల్ సిటీ, ఆగస్టు 16ఆంధ్రజ్యోతి): కఠోర సాధనతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించాడు నగర శివారులోని బౌరంపేట్ గ్రామానికి చెందిన తులసిరెడ్డి అనే యువకుడు. 78వ స్వాతంత్ర దినోత్సవం రోజున యూరప్ ఖండంలో అతిపెద్దదైన (5,642 అడుగుల ఎత్తైన) మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని తులసిరెడ్డి అధిరోహించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించి జై భారత్ అంటూ నినదించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎవరెస్ట్ పర్వతాన్ని తక్కువ సమయంలో అధిరోహించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019లో సముద్రమట్టానికి 6,153 మీటర్ల ఎత్తులో ఉన్న స్టాక్ ఖంగ్రీ అనే మంచు పర్వతాన్ని మైనస్ 15 డిగ్రీలలో, 2021లో 4190 అడుగుల ఎత్తున ఉన్న కాశ్మీరీ గ్రేట్ లెగ్స్ శిఖరాన్ని, 2013లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించినట్లు తెలిపారు.

దొంగపోలీస్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీస్‌గా చెప్పుకొని బెదిరిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్న ఓ అంతరాష్ట్ర దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరానీగ్యాంగ్‌కు చెందిన సభ్యుడిగా గుర్తించిన పోలీసులు అతని నుంచి రూ.95వేల నగదు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వరుసగా దారిదోపిడీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేశారు. పోలీసు అధికారిగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి రోడ్డుమీద వెళ్తున్న వారిని బెదిరిస్తూ మీరు నకిలీ కరెన్సీ తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చిందని నకిలీ ఐడీతో వారిని బురిడీ కొట్టిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీలు జల్లెడ పట్టి బేగంబజార్ పరిధిలో అతన్ని పట్టుకున్నారు. అతన్ని విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్ ఇరానీ గల్లీలో ఉండే.. ఇరానీ ముఠాకు చెందిన జాఫర్ ఆలీ అలియాస్ లంబుగా ఒప్పుకొన్నాడు. నగదు రవాణా చేసేవారిని గుర్తించి పోలీస్ అంటూ బెదిరిస్తాడు. మీవద్ద నకిలీ కరెన్సీ ఉందని చెక్ చేయాలని నమ్మిస్తాడు. క్రమంలో వారి దృష్టి మరల్చి నగదు లేదా బంగారం దోచుకొని ఉడాయిస్తాడు. ఇటీవల వరుసగా ఐదు కేసులు నమోదవడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం రంగంలోకి దిగి, బేగంబజార్ పోలీసులతో కలిసి అతన్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.



నూతన అధ్యక్షుడు ఓంప్రకాశ్‌ముదిరాజ్‌ను సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్

న్యూఅశోక్‌నగర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా ఓంప్రకాశ్‌ముదిరాజ్

బౌద్ధనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పార్శిగుట్టలోని న్యూఅశోక్‌నగర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఓంప్రకాశ్‌ముదిరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీహాలులో మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, బస్తీకమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా ఓంప్రకాశ్‌ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ద్వారా ప్రజాసమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, న్యూఅశోక్‌నగర్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని నూతనంగా నియమితులైన అధ్యక్షుడు తెలిపారు. మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, నూతన అధ్యక్షుడు ఓంప్రకాశ్‌ముదిరాజ్‌ను సత్కరించారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షుడు మల్లేష్, బస్తీకమిటీ సభ్యులు పర్వతాలు, బాచి, దప్పుమల్లికార్జున్, వేణు, రాముగౌడ్, అశోక్, రవీందర్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఈటీఈ జాతీయ అవార్డుకు ఓయూ ప్రొ.నవీన్ కుమార్ ఎంపిక



ప్రొ.నవీన్ కుమార్

తార్నాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పెరుమాళ్ల నవీన్‌కుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈటీఈ) 2024 అవార్డుకు ఎంపికయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో ఆయన చేసిన విశిష్ట సేవలకుగాను జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన శ్రీనివాసన్ మెమోరియల్ 2024 అవార్డు దక్కిందని ప్రొ.నవీన్ కుమార్ తెలిపారు. ప్రొ.నవీన్ కుమార్ 120కి పైగా పరిశోధనా ప్రచురణలతో పాటు, ఇస్రోతో అనేక ప్రాజెక్టులు చేశారు. అదేవిధంగా ఓయూలో అధునాతన జీఎన్ఎస్ఎస్ రీసెర్చ్ ల్యాబొరేటరీ స్థాపనలో కీలక భూమిక పోషించారు. సెప్టెంబర్ 14న భోపాల్‌లో జరిగే ఐఈటీఈ మిడ్ సింపోజియం కార్యక్రమంలో ప్రొ.నవీన్ కుమార్ అవార్డును అందుకోనున్నారు.

మౌంట్ ఎల్బ్రస్‌పై ఎగిరిన మువ్వన్నెల జెండా

- యూరప్‌లో అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించిన దుండిగల్ యువకుడు



దుండిగల్ సిటీ, ఆగస్టు 16ఆంధ్రజ్యోతి): కఠోర సాధనతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించాడు నగర శివారులోని బౌరంపేట్ గ్రామానికి చెందిన తులసిరెడ్డి అనే యువకుడు. 78వ స్వాతంత్ర దినోత్సవం రోజున యూరప్ ఖండంలో అతిపెద్దదైన (5,642 అడుగుల ఎత్తైన) మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని తులసిరెడ్డి అధిరోహించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించి జై భారత్ అంటూ నినదించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎవరెస్ట్ పర్వతాన్ని తక్కువ సమయంలో అధిరోహించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019లో సముద్రమట్టానికి 6,153 మీటర్ల ఎత్తులో ఉన్న స్టాక్ ఖంగ్రీ అనే మంచు పర్వతాన్ని మైనస్ 15 డిగ్రీలలో, 2021లో 4190 అడుగుల ఎత్తున ఉన్న కాశ్మీరీ గ్రేట్ లెగ్స్ శిఖరాన్ని, 2013లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించినట్లు తెలిపారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి ..

రూ.10కోట్ల ప్రత్యేక గ్రాంట్

- మొదటి విడత కింద రూ.5.49కోట్లు విడుదల
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ చరిత్రలో ఇదే ప్రథమం



సికింద్రాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ చరిత్రలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంట్ మంజూరైంది. కంటోన్మెంట్‌లో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 10 కోట్ల రూపాయిలను మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, దీనిలో భాగంగా తొలి విడత కింద 5.59 కోట్ల రూపాయిలు విడుదల చేసింది. ఈ వివరాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్‌కు పంపారు. గతంలో శాసనసభ్యుని నిధుల ద్వారా కంటోన్మెంట్‌లో బోర్‌వెల్స్, కమ్యూనిటీ హాళ్లు, జిమ్‌ల నిర్మాణ తదితర అవసరాలకు మాత్రమే నిధులు మంజూరయ్యేవి, తొలిసారిగా ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం పట్ల కంటోన్మెంట్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కంటోన్మెంట్‌లో 18పనులు చేపట్టడానికిగాను స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 10 కోట్లు మంజూరు కాగా, దీనిలో 2కోట్ల రూపాయిలు విద్యకు, కోటి రూపాయిలను మంచినీటి సదుపాయాలకు, 50లక్షల రూపాయిలను ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఖర్చు పెట్టనున్నారు. కాగా ప్రస్తుతం 5.49కోట్ల నిధులు విడుదల కావడంతో వీటి నుంచి బాపూజీనగర్‌లో 18లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, కార్ఖానా ప్రభుత్వ పాఠశాల వద్ద 56 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, బొల్లారంలో 1.75 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, రసూల్‌పురాలో 37 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, 4వ వార్డు ఎల్‌బీసీ కాలనీలో 30లక్షలతో కమ్యూనిటీ హాలును, 1.15 కోట్లతో అమ్ముగూడ స్టేషన్-తిరుమలగిరి ప్రధాన రహదారి నిర్మాణం, 48లక్షల వ్యయంతో రసూల్‌పురాలో నాలా అభివృద్ధి చేపట్టనున్నారు. అలాగే కంటోన్మెంట్‌లోని వివిధ వార్డుల్లోని 10 ప్రాంతాల్లో బోర్‌వెల్స్ వేయనున్నారు.

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే శ్రీగణేష్ కృతజ్ఞతలు

కంటోన్మెంట్ చరిత్రలో తొలిసారిగా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేసిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని, 5.49 కోట్ల రూపాయిల నిధులు విడుదల చేసినందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

- ఇక నుంచి కంటోన్మెంట్‌లో బోర్ల నిర్మాణ బాధ్యత కంటోన్మెంట్ బోర్డుకే

ఇక నుంచి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బోర్ల నిర్మాణ బాధ్యతలను కంటోన్మెంట్ బోర్డు నిర్వహించనున్నది. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వివిధ సంస్థల ఆధ్వర్యంలో బోర్ల నిర్మాణం జరిగేది. అయితే బోర్ల నిర్మాణం విషయంలో సదరు సంస్థలు సక్రమంగా వ్యవహరించడంలేదన్న ఫిర్యాదులు అందడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బోర్ల నిర్మాణానికి విడుదలైన నిధులను కంటోన్మెంట్ బోర్డుకు అప్పగించి, బోర్డు ద్వారానే బోర్ల నిర్మాణం చేపడతారు.

ప్రభుత్వ శాఖల్లో అక్రమంగా కొనసాగుతున్న

రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే తొలగించాలి

- టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్



రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులు

తార్నాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ తరువాత వివిధ ప్రభుత్వ శాఖల్లో అక్రమంగా కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే తొలగించాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు పదవీ విరమణ తరువాత ఉద్యోగాల్లో కొనసాగడాన్ని నిరసిస్తూ తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ సుమారు వెయ్యి మంది రిటైర్డ్ ఉద్యోగులు పదవీ విరమణ తరువాత ఉద్యోగాల్లో కొనసాగుతూ పెన్షన్‌తో పాటు, అక్రమంగా జీతాలు, అలవెన్సులు పొందుతున్నారని, దీనివల్ల దాదాపు నెలకు రూ.150కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని తీవ్రంగా మండిపడ్డారు.

అంతేకాకుండా రిటైర్డ్ ఉద్యోగులు ఉద్యోగాల్లో కొనసాగడం వలన అర్హులైన సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు దక్కకుండానే రిటైర్ అవ్వాల్సిన దుస్థితి ఏర్పడంతోపాటు, నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రిటైర్డ్ ఉద్యోగులను తొలగించి సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని, తద్వారా ఏర్పడే ఖాళీల్లో ఉద్యోగ నోటిఫికేషన్‌ల ద్వారా ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి రిటైర్డ్ ఉద్యోగులను తొలగించి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వ ఉద్యోగులను, నిరుద్యోగులందరినీ కలుపుకుని సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఏ విద్యార్థి నాయకులు రామ్‌కిషన్, మురళీకృష్ణ, రంజిత్ వర్మ, కార్తీక్ పాల్గొన్నారు.

దొంగపోలీస్ అరెస్ట్

- దొంగనోట్ల చెకింగ్ అంటూ బెదిరించి దారిదోపిడీలు
- కటకటాల్లోకి ఇరానీగ్యాంగ్ ముఠా సభ్యుడు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌గా చెప్పుకొని బెదిరిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్న ఓ అంతరరాష్ట్ర దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరానీగ్యాంగ్‌కు చెందిన సభ్యుడిగా గుర్తించిన పోలీసులు అతని నుంచి రూ.95వేల నగదు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..బేగంబజార్, సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, కుల్సుంపురా, లంగర్‌హౌజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో ఇటీవల వరుసగా దారిదోపిడీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘావేశారు. పోలీసు అధికారిగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి రోడ్డుమీద వెళ్తున్న వారిని బెదిరిస్తూ మీరు నకిలీ కరెన్సీ (దొంగనోట్లు) తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చిందని, అందుకే మఫ్టీలో ఉండి చెక్ చేస్తున్నామని నకిలీ ఐడీతో వారిని బురిడీ కొట్టిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీలు జల్లెడ పట్టి బేగంబజార్ పరిధిలో అతన్ని పట్టుకున్నారు. అతన్ని విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్ ఇరానీ గల్లీలో ఉండే.. ఇరానీ ముఠాకు చెందిన జాఫర్ ఆలీ అలియాస్ లంబుగా ఒప్పుకొన్నాడు. ఇతను పలు నగరాల్లో తిరుగుతూ, వ్యాపార ప్రాంతాలు అధికంగా ఉండే ఏరియల్లో రెక్కీ చేస్తాడు. నగదు రవాణా చేసేవారిని గుర్తించి రహస్యంగా ఫాలో అయి, పోలీస్ అంటూ బెదిరిస్తాడు. మీవద్ద నకిలీ కరెన్సీ ఉందని చెక్ చేయాలని నమ్మిస్తాడు. ఈ క్రమంలో వారి దృష్టి మరల్చి నగదు లేదా బంగారం దోచుకొని ఉడాయిస్తాడు. ఇటీవల వరుసగా ఐదు కేసులు నమోదవడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం రంగంలోకి దిగి, బేగంబజార్ పోలీసులతో కలిసి అతన్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

యువతిపై అసభ్యకర ప్రవర్తన

- కేకలు వేయడంతో పారిపోయిన పోకిరీ

మారేడుపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వర్షంలో నడుచుకుంటూ వెళ్తున్న యువతిపై ఓ పోకిరీ అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యువతి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయిన ఘటన జేబీఎస్ పరిధిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి 10 గంటలకు భారీ వర్షం కారణంగా బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. జేబీఎస్ బస్‌స్టాండ్‌కు వెళ్లేందుకు ఓ యువతి జేబీఎస్ గేట్ వెనుక వైపు నుండి వెళ్లేందుకు ప్రయత్నించింది. అక్కడ తక్కువ లైటింగ్ ఉండటం వెలుతురు సరిగా లేని ఆ ప్రాంతం నుండి ఆమె నడుచుకుంటూ వెళుతుండగా.. ఓ గుర్తుతెలియని పోకిరీ వెనుక నుంచి వచ్చి యువతిని పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో యువతి అప్రమత్తమై గట్టిగా కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. అదే రోజు రాత్రి ఈ ఘటనపై బాధితురాలు మారేడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రదేశం చీకటిగా ఉండడం, ఒక కారణమైతే.. సీసీ కెమెరా లేకపోవడం గమనార్హం. పరేడ్ గ్రౌండ్, జేబీఎస్ మెట్రో రైల్ స్టేషన్లు, ఉన్నప్పటికీ ఇక్కడ భద్రతను గాలికి వదిలిస్తున్నారని బాధితులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. నిందితునిపై కేసు నమోదు చేశామని, దుండగున్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.



మహాకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఉజ్జయినీ మహాకాళి ఆలయం



తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహాకాళి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆధ్యాత్మిక శోభతో అమ్మవారి దేవాలయాలు

సికింద్రాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రతంను పురస్కరించుకుని లష్కర్‌లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయం, రెజిమెంటల్ బజార్‌లోని సంతోషిమాత ఆలయం, సోమసుందరం వీధిలోని శ్రీదేవి, పోచమ్మ ఆలయం, కళాసిగూడలోని ముత్యాలమ్మ ఆలయం తదితర దేవాలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని గాజులతో అలంకరించడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి సాక సమర్పణ



ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి సాక సమర్పిస్తున్న భక్తులు

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి శుక్రవారం 108 బోనాలతో సాక సమర్పించారు. లష్కర్ బోనాల జాతరలో కీలక ఘట్టమైన 'రంగం' కార్యక్రమంలో భవిష్యవాణి తనకు 5వారాల పాటు 108 బోనాలతో సాక సమర్పించాలని చెప్పారు.

దాంతో మహాకాళి ఆలయ ఆధ్వర్యంలో గత శుక్రవారం తొలిసారిగా అమ్మవారికి సాక సమర్పించారు. తాజాగా రెండో వారం కూడా 108 బోనాలతో ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి సాక సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులతో కిటకిట

తిరుమలగిరి : బొల్లారం తిరుమలగిరిలోని అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహాకాళి దేవాలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పిల్లాపాపలను చల్లంగ చూడు తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం భారీగా తరలివచ్చిన మహిళలు పసుపు బొట్టు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు దేవాలయం అడ్‌హాక్ కమిటీ చైర్మన్ మర్కంటి మురళీముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగాయి. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. శ్రావణ మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నామని మురళీ ముదిరాజ్ తెలిపారు. బొల్లారంలోని తోట ముత్యాలమ్మ దేవాలయం, సదర్‌బజార్‌లోని మహాకాళి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలు ఘనంగా జరిగాయి.



ఓ విజేత కథ 'మూడో చెవి' నవలిక ఆవిష్కరణ



రాజులపల్లి ప్రతాప్ అనువదించిన 'మూడో చెవి' నవలికను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పుట్టు చెవిటి పిల్లలకు మాటలెలా నేర్పాలో తెలియజెప్పే వాస్తవ కథ ఆధారంగా కన్నడలో వచ్చిన నవలికను 'మూడో చెవి' పేరుతో స్ఫూర్తిదాయకమైన ఓ విజేత కథను తెలుగువారికి పరిచయం చేయడం ముదావహం అని రచయితను ప్రశంసించారు. ఈ పుస్తకం తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాజుల పల్లి ప్రతాప్ కన్నడ నుంచి తెలుగులోకి అనువదించిన 'మూడో చెవి' నవలికను శుక్రవారం రవీంద్రభారతిలో ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. అనంతం ఆయన ఈ నవలిక మూల రచయిత ప్రజావాణి కన్నడ పత్రిక ఎడిటర్ రవీంద్ర భట్, గీతా దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. పుట్టు చెవిటి అయిన నిరంజన్‌కు అతని తల్లి గీతా భట్ మాటలెలా నేర్పారో ఈ పుస్తకం కళ్ళకు కడుతుందని తెలిపారు. మూల రచన స్ఫూర్తిని యథాతథంగా తెలుగులోకి తేవడంలో ప్రతాప్ అనువాద సృజన పాఠకులను ఆకట్టుకుంటుందని అన్నారు. తెలుగు వారికి ఈ స్ఫూర్తిదాయకమైన గాథను పరిచయం చేయాలన్న సంకల్పంతో తాను అనువదించిన 'మూడో చెవి' పుస్తకాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ప్రతాప్ ప్రకటించారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు అభినందనల వెల్లువ



ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి అభినందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, దయాకర్

అల్వాల్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆపార్టీ శ్రేణులు, ఉద్యమకారులు శుక్రవారం ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ జనసమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు భద్రగమ అంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఏర్పుల దయాకర్, నాయకులు, రెడ్డిపల్లి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్, తెలంగాణ ఉద్యమకారుల పోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ సురేందర్‌రెడ్డి, నిర్మల్ జేఏసీ చైర్మన్ విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

